క్లుప్తంగా

అభివృద్ధిపై సమీక్ష



ఆత్మకూర్: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల జాబితాను ఈ నెల 20లోపు పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాజు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, ఈసీ రక్షిత అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విద్య, వైద్యం, పారిశుద్ధ్యం తదితర అభివృద్ధి పనుల పురోగతిని సిద్ధం చేసి 27వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి పనుల జాబితాను సైతం సిద్ధం చేయాలని ఆదేశించారు.

టెస్టు పేపర్లు పంపిణీ



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో గురువారం పాఠశాలలకు టెస్టు పేపర్లు పంపిణీ చేశారు. 1 నుంచి 4వ తరగతి విద్యార్థులకు వీక్లీ టెస్టు పేపర్లు, హైస్కూల్ విద్యార్థులకు టెస్టు పేపర్లు పంపిణీ చేసినట్లు బాలుర ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థుల ప్రమాణాలను పరిశీలించేందుకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు వెంకటేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 4వ వార్డు నర్సింగాయపల్లికి చెందిన బాలనాగమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఈ మేరకు నక్క రాములు యాదవ్, శేఖర్‌రెడ్డి, వెంకట్ ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ధైర్యంగా ఉండాలని చెప్పారు. వారి వెంట కౌన్సిలర్లు విభూతి నారాయణ, సుమిత్ర, శేఖర్, కూరగాయల రవి, నాయకులు యాదగిరి, ఆదిత్య, శశాంక్‌సాగర్ ఉన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మోజర్లకు చెందిన గట్టు సామేల్ (60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఏఐసీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యారెడ్డికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన తక్షణ సాయం కింద రూ.5వేలు పంపించారు.

ఓటరు నమోదు



ఆత్మకూర్: 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు నమోదు చేయించాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ రాజు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. ఈ నెల 20, 21వ తేదీల్లో గ్రామాల్లో పర్యటించి 18 ఏళ్లు పూర్తయిన వారి వివరాలను సేకరించి ఓటుహక్కు కోసం నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్‌ఐ జయమ్మ, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్‌ఓలు ఉన్నారు.

బహుమతుల అందజేత



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఫైనల్‌లో విన్నర్‌గా నిలిచిన విజేత కీర్తి రైడర్స్ జట్టుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రూ.20 వేలు, రెండో బహుమతి అనివిడ్ సైకర్స్ రూ.15 వేలు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, వెంకటస్వామి, నరేష్, ప్రవీణ్, బలరాంనాయక్, ఆనంద్, గుడిసె ధర్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడి రాజీనామా

ఖిల్లాఘనపురం: భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం అధ్యక్ష, జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల సభ్యుడి పదవికి, పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన విప్పటూరు విక్రమ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తాను ఎవరిపైన కోపం, వ్యతిరేకతతో బీఆర్‌ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయడం లేదన్నారు. రాజీనామా పత్రాలను మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. తాను ఏ పార్టీలో చేరేది త్వలోనే ప్రకటిస్తానని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

- మండల సర్వసభ సమావేశం నిర్వహణ
- సర్పంచ్‌లకు ఇదే చివరిది
- అధికారుల తీరుపై ఆగ్రహం



మాట్లాడుతున్న అధికారులు

చిన్నంబావి: ఏళ్ల తరబడి గ్రామస్థాయిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నించడంలో అధికారులు విఫలం అయ్యారంటూ మండలంలోని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లకు చివరి సమావేశం కావడంతో ఉద్వేగభరితం సభ కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం అధికారులు సత్వరం కృషి చేయాలని, ఎలాంటి రాగద్వేషాలు లేకుండా ప్రజాపాలనను అందించేందుకు అధికారులు పని చేయాలని పిలుపునిచ్చారు.

అధికారుల డుమ్మా

ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. యాథావిధిగా ప్రభుత్వ శాఖ అధికారులు డుమ్మాకొట్టారు. సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి పలు కీలకమైన శాఖల అధికారులు ఒక్క సమావేశానికి రాకపోవడం బాధాకరమని అయ్యవారిపల్లి, వెల్టూరు, పెద్దదగడ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని సర్వసభ్య సమావేశాలు నిర్వహించి ఉన్నతాకారుల దృష్టికి ఎన్నో దీర్ఘకాలిక సమస్యలను తీసుకొచ్చినా.. ఒక్కటంటే ఒక్క సమస్యకు కూడా పరిష్కారం చూపాలేదని అయ్యవారిపల్లి సర్పంచ్ రామస్వామి అధికారుల అలసత్వాన్ని తూర్పారబట్టారు.

భావోద్వేగంతో సర్పంచ్‌లు

మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నో సమస్యలను పరిష్కారం కోసం తాము అహర్నిషలు కృషి చేశామని, ఇదే సభ వేదికపై సమస్యలపై గళం విప్పామని సర్పంచ్‌లు గడిచిన రోజులను గుర్తుచేసుకున్నారు. ప్రజలు తమను నమ్మి ప్రజాప్రతినిధులుగా చేసినందుకు ప్రజాసేవ చేయడమే లక్ష్యంగా పని చేశామని, తమకు ఐదేళ్ల పాటు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సహకరించారని వెలగొండ, కొప్పునూరు, వెల్టూరు, పెద్దమారూర్, పెద్దదగడతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవి నారయణ, జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ, సర్పంచ్‌లు గోవిందు శ్రీధర్‌రెడ్డి, మద్దిలెట్టి, చక్రధర్‌గౌడ్, చక్రవర్తి, రామస్వామి, నంది కౌసల్య, పద్మమ్మ, శివమ్మ, సురేందర్‌సింగ్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శితో ఆరా తీస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను మంత్రి జూపల్లి సహకారంతో పరిష్కరిస్తామని కాంగ్రెస్ మండల నాయకులు రాముయాదవ్, బ్రహ్మయ్య అన్నారు. గురువారం కాలనీవాసులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్ భగీరథ పైపులైన్లు ధ్వంసమై కొంతకాలంగా నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తిందని కాలనీవాసులు వారి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లడంతో ధ్వంసమైన పైపులైన్ల స్థానంలో నూతన పైపులైన్ ఏర్పాటు చేసి కాలనీ సమీపంలోని దామచెరువు నుంచి కాలనీవరకు పైపులైన్లు ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవడంపై కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం



కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాన్‌గల్: మహనీయులు స్ఫూర్తితో ముందుకు సాగుతూ సామాజిక ఉద్యమాలు, ప్రజల్లో చైతన్యం, ప్రతి ఘటన శక్తిని పెంపొందిస్తున్నామని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేవీపీఎస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కమీషన్ కోసం, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం కోసం కేవీపీఎస్ పోరాటాలు నిర్వహించిందన్నారు. నేటికీ సమాజంలో కుల వివక్షత, అంటరానితం, సామాజిక అణిచివేతలను వ్యతిరేకిస్తూ అందరూ ఐకమత్యంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నర్సింహ, స్వామి, గోపిచంద్, రామకృష్ణ, భాస్కర్, లక్ష్మణ్, ఈశ్వరయ్య, వెంకటస్వామి, రాములు, దశరథం పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

గోపాల్‌పేట: మండలంలోని ఏదుట్లలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. కీర్తిశేషులు నరెడ్డి బిచ్చిరెడ్డి, వెంకటమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి టోర్నీ నిర్వహించారు. మొత్తం 30 జట్లు పోటీల్లో పాల్గొనగా తాడిపర్తి, ఏదుట్ల ఫైనల్‌లో తలపడ్డాయి. ఏదుట్ల విన్నర్‌గా నిలిచి షీల్డుతో పాటు రూ.30 వేలు, తాడిపర్తి రన్నరప్‌గా నిలిచి రూ.20 వేలు షీల్డు సొంతం చేసుకున్నాయి. గెలిచిన టీంలకు కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బహుమతులు అందించారు. క్రీడలు ఆడటం వల్ల మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ రాజు, రాజేష్‌గౌడ్, సురేష్‌గౌడ్, యుగంధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, విష్ణు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు



ఖిల్లాఘనపురం: మండలంలోని ప్రతి గ్రామంలో తరుచుగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో వివిధ పథకాలపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన పనుల గురించి చర్చించారు. తెలంగాణకు హరితహారం, పల్లె ప్రకృతివనం, బృహత్ పల్లె ప్రకృతివనం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వం చేపడుతున్న ప్రతి పథకాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు పాల్గొన్నారు.

చిరుతల బారి నుంచి రక్షించండి



పర్వతాపురంలో ఫారెస్టు అధికారికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఖిల్లాఘనపురం: మండలంలోని పర్వతాపురం శివారులో తిరుగుతున్న చిరుతను బంధించి తీసుకెళ్లాలని గురువారం గ్రామస్తులు ఫారెస్టు అధికారులకు విన్నవించారు. గ్రామ శివారులో బుధవారం చిరుత గొర్రెల మందపై దాడి చేసి ఓ గొర్రెను ఎత్తుకెళ్లి చంపిన విషయం తెలియడంతో గురువారం ఫారెస్టు ఇన్‌చార్జ్ రేంజ్‌అధికారి భాస్కరాచారి, బీట్ ఆఫీసర్ వంశీ, అధికారులు అంజనేయులు, చంద్రయ్య గ్రామానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచు నిర్మల గ్రామస్తులతో కలిసి ఫారెస్టు అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. చిరుత గ్రామ శివారులో తిరుగుతుండటంతో ప్రజలంతా భయంతో వణికి పోతున్నారని, ఎలాగైనా చిరుతను బంధించి తీసుకెళ్లాలని కోరారు. పులిని తీసుకెళ్ల కుంటే రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. అదేవిధంగా చిరుత దాడిలో మృతి చెందిన గొర్రెకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్‌ఆర్‌ఓ మాట్లాడుతూ వీలైనంత వరకు చిరుత తిరుగుతున్న ప్రాంతాలను గుర్తించి సీసీ కెమరాలను ఏర్పాటు చేస్తామన్నారు. వాటి కదలికలను గుర్తించి బోను ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. మృతిచెందిన గొర్రెకు నష్టపరిహారం ప్రభుత్వం నుంచి అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలి

పెబ్బేరు రూరల్: గ్రామపంచాయతీ కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ కోరారు. గురువారం జిల్లాకేంద్రంలోని యాదవ భవనంలో నిర్వహించిన ఇప్టూ జిల్లా ప్రథమ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,769 గ్రామపంచాయతీలో సుమారు 60 వేల మందికిపైగా మల్టీపర్పస్ వర్కర్స్‌గా వివిధ రకాల పనులు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి కార్మికులు, ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు.

రాత పుస్తకాల పంపిణీ



పెబ్బేరు రూరల్: దాడి రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం గురువారం శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన వారి కుమారుడు దాడి కిష్టారెడ్డి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్కులు, పండ్లు, బిస్కెట్లు, ఫ్రూట్‌జ్యూస్, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ యాదవ్, రాములుయాదవ్, కురుమన్న, గాడి జయంతి, హెచ్‌ఎం రామచంద్రయ్య, ఉపాధ్యాయులు శేఖర్‌రెడ్డి, రేణుక, మాధవి, లత, రవి రాజు తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో అ'పూర్వ' సమ్మేళనం



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో 2003–2004 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పలువురు విద్యార్థులు గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు చిన్నప్పుడు పాఠాలు బోధించిన గురువులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, నర్సింహయ్య, ధర్మారెడ్డి, జ్యోతి, నర్సింహ, స్వరాజ్యం, చంద్రకాంత్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాంబాబు, నరేందర్, వీరశేఖర్, యాదగిరి, లక్ష్మణ్, నరేందర్, వేణుగోపాల్, రాజబాబు, కుర్మయ్య, ప్రశాంతి, చిన్నమ్మ, సాయికృష్ణ, రామేశ్వరి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం



గోపాల్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూర్: ప్రముఖ సినీనటుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చేసిన సేవలు చిరస్మరణీయమని అభిమానులు కొనియాడారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆత్మకూర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్టీడీ శ్రీనివాసులు, అశోక్‌కుమార్, తిరుపతయ్యగౌడ్, హన్మంతు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలో టీడీపీ నాయకులు బస్టాండ్ కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోదీ మనోహర్‌రాజు, అబ్రహం, గోపాల్‌యాదవ్, నసీర్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆటో రాంచంద్రయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు రాములు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజు, మాజీ సర్పంచు సామేలు, రాంచంద్రయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి సన్మానం



వెంకట్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సన్మానించి తన మద్దతు వెల్లడించారు. అసెంబ్లీ ఆవరణలో నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియకు హాజరై ఎమ్మెల్సీ అభ్యర్థులు బల్మూరు వెంకట్, మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎల్‌ఓసీ అందజేత

నియోజకవర్గంలోని ఖిల్లాఘనపురం మండలం మామిడిమాడకు చెందిన పెద్దబాలయ్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో చికిత్స కోసం రూ. 2 లక్షల ఎల్‌ఓసీని గురువారం ఎమ్మెల్యే హైదరాబాద్ ఆఫీస్‌లో అందజేశారు.

పరామర్శ

తన వద్ద పనిచేసే గోపాల్ భార్య యాదమ్మ కిడ్నీ సమస్యతో అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

సైబర్ నేరం: కేసు నమోదు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరంపై కేసు నమోదైనట్లు ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వనపర్తి పట్టణంలోని సాయినగర్‌కాలనీకి చెందిన మహేందర్ ఈ నెల 4న ఫోన్ యాప్ బ్లాక్ అయ్యిందని మెసేజ్ వచ్చింది. తను వెంటనే ఆ లింక్‌ను ఓపెన్ చేస్తే ఓటీపీ వచ్చింది. ఆ ఓటీపీని వెంటనే ఎంటర్ చేయగా.. ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ.50 వేలు కొట్టేశారు. వెంటనే ఎస్‌బీఐ నాగవరం, మేనేజర్‌ను సంప్రదించగా ఆన్‌లైన్ ద్వారా మోసం అని తెలుసుకొని వెంటనే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లకు ఆర్డర్లు అందజేత



మదనాపురం: మినీ అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వం ప్రధాన అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతులు కల్పించింది. గురువారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మదనాపురం, కొత్తకోట మండలాల అంగన్‌వాడీ టీచర్లకు ఆర్డర్లను అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి భారతిరెడ్డి, సూపర్‌వైజర్లు, నర్మత, సబిత, శారద, తదితరులు పాల్గొన్నారు.


ఆట పాటలతో..

వీపనగండ్ల: అంగన్‌వాడీ చిన్నారులకు ఆట పాటల ద్వారా విద్య అందించడం వల్ల రాబోయే రోజుల్లో వారు ఉన్నతంగా రాణించగలుగుతారని అంగన్‌వాడీ టీచర్ సుగుణాభాయి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆట పాటలతో పాటు వివిధ ఆకృతులు, కలర్లతో కూడిన బొమ్మలతో చిన్నారులకు విద్యాభ్యాసం చేశారు. కార్యక్రమంలో ఆయా ఈశ్వరమ్మ, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

శ్రీరంగాపురం ఆలయాన్ని శుద్ధి చేసిన బీజేపీ నేతలు

పెబ్బేరు రూరల్: ప్రధాని మోదీ పిలుపు మేరకు శ్రీరంగాపురం రంగనాయకస్వామి ఆలయాన్ని గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి జిల్లా, స్థానిక నాయకులతో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు మూడురోజుల పాటు తమ గ్రామాల్లోని ఆలయాలతో పాటు పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ ఉందని.. ప్రతి ఒక్కరూ ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మున్నూర్ రవీందర్, రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, వెంకట్రామారెడ్డి, భగవంతుయాదవ్, వెంకటస్వామి, కంచె ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అక్షింతల ఊరేగింపు



అమరచింత: అయోధ్య రామ మందిర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలో గురువారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో రాములోరి అక్షింతలను భక్తి శ్రద్ధలతో పంపిణీ చేశారు. అక్షింతలతో పాటు నియమావళికి సంబంధించిన పుస్తకాలను అయోధ్య రామమందిర చరిత్రను తెలిపే పుస్తకాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో తాటికొండ విజయ్, మేర్వరాజు, సత్యనారాయణ, విజయ్, బావండ్లరాములు, ఎల్లబాలస్వామి, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అనైతికం

- కింది స్థాయి సిబ్బందితో అసాంఘిక కార్యకలాపాలు
- ఎంసీహెచ్‌లో నిర్వాకం
- సీసీ కెమెరాల్లో రికార్డు
- ఫుటేజీ భద్రపర్చాలని సూపరింటెండెంట్ ఆదేశాలు



వనపర్తి ఎంసీహెచ్‌లో స్వీపర్లు డ్రెస్‌లు మార్చుకునే గది

వనపర్తి టౌన్: గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు వైద్య సేవలు అందించే గోపాల్‌పేట రోడ్డులోని ఎంసీహెచ్ ఆస్పత్రిలోలో అనైతిక కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు అక్కడ పనిచేసే శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బంది వాపోతున్నారు. ఈ మేరకు ఓ ఉన్నతాధికారి సిబ్బంది కింది స్థాయి సిబ్బందితో అసభ్యంగా వ్యవహరిస్తున్నారని గురువారం ఆస్పత్రిని సందర్శించిన 'సాక్షి'తో వాపోయారు. కొన్ని నెలలుగా ఈ వ్యవహారంపై విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఇందులో భాగంగానే ఈనెల విధుల కేటాయింపులో బహిర్గతం చేయాల్సిన రోస్టర్ ప్రకటించకుండానే తనకు నచ్చిన వారికి సానుకూలంగా డ్యూటీలు వేస్తున్నారు. ఈ అంశంపై వైద్యాధికారులు సైతం నోరు మెదపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ అధికారి అసాంఘీక కార్యకలాపాలను ఆస్పత్రిలో బాలింతలు, వైద్యాధికారులు ఉండే రూమ్‌ల గది పక్కనే స్వీపర్లు డ్రెస్‌లు మార్చుకునే గదినే అడ్డాగా ఎంచుకున్నాడని మండిపడుతున్నారు. ఈ మేరకు ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి 11గంటల తర్వాత సిబ్బందితో అసాంఘీక కార్యకలాపాలకు ఆ గదినే వినియోగించుకున్నట్లు సీసీ ఫుటేజీలో నమోదైనట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సూపరింటెండెంట్ వారం రోజులుగా ఆస్పత్రిలో నమోదైన సీసీ ఫుటేజీని భద్రపరచాలని కంప్యూటర్ ఆపరేటర్లను ఆదేశించారు. ఈ విషయంలో అవసరం అనుకుంటే హైదరాబాద్ నుంచి సాంకేతిక నిపుణులు పిలిపించాలని సూచించారు. ఈ విషయమై ఎంసీహెచ్ ఆర్‌ఎంఓ బంగారయ్యను వివరణ కోరగా.. తమ దృష్టికి రాలేదని, ఎవరు ఫిర్యాదు చేయలేదని చెప్పారు. ఈ అంశంపై డాటా ఎంట్రీ ఆపరేటర్లను సీసీ ఫుటేజీ భద్రపరచాలని సూపరింటెండెంట్ ఆదేశించినట్లు తెలిసిందని చెప్పారు.